

ఎండుతున్న 'హంద్రీ' పొలాలు

- ఆయకట్టుకు పూర్తి స్థాయిలో అందని నీరు - ఖరీఫ్‌లో 65 శాతం పంట నష్టపోయిన రైతులు



ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నా ప్రభుత్వంలో రైతులు పండించిన పంట కళ్లెదుటే వాడుతున్నా నీరందివ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు వైఫల్యం చెందారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా కింద ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికొచ్చే సమయానికి నీరు అందక 65 శాతం పంట నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా రైతులకు ఒరిగిందేమి లేదని అన్నదాత ఆక్రోశం చెందుతున్నారు...

హంద్రీనీవా ప్రాజెక్టు నివేదిక ప్రకారం కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్ సీజన్‌లో హంద్రీనీవా ద్వారా ఏడు టిఎంసిల నీటి వాడకం కోసం, ఒక టిఎంసిని కర్నూలు తాగునీటి అవసరాలకు తీసుకుంటుంది. 18 సంవత్సరాలు పూర్తి అయినా హంద్రీ ఆయకట్టులో ఇప్పటికి కేవలం 31 వేల ఎకరాలకు మాత్రమే నీటిని అందిస్తున్నారు. నీటిని అందించాలని రైతులు కోరుతున్నా కాంట్రాక్టర్లు సహకరించలేదని, తగినంత నీటి లభ్యత లేదని, ప్రభుత్వం అనుమతులు లేవని, పిల్లకాలువలు లేవని మాయమాటలు చెప్తూ జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని రైతాంగం ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఆర్థిక మంత్రి, కార్మిక శాఖ మంత్రి ఉన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఆర్థిక మంత్రి వ్యవహరిస్తున్నా హంద్రీనీవా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదని పంట చేతికి వచ్చే సరైన సమయంలో హంద్రీనీవాకు నీటిని నిలిపివేసిన దుస్థితి జిల్లాలో ఏర్పడింది. తద్వారా పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమోటా, తదితర పంటలన్నీ వాడిపోయాయి. మంత్రులు నిరర్థకమైన మాటలతో కాలం వెళ్లబుచ్చడం తప్ప రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమయ్యారని వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పత్తికొండ, దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో రైతులు నీటికోసం ఎదురుచూసి వలసబాటలు పడుతున్నారు. ఇటీవల కాలంలో ప్రజలు, రైతులు, వామపక్ష, ప్రతిపక్షాల నుండి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో కార్మిక శాఖ మంత్రి వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్టిమేషన్ తయారు చేయాలని కోరగా అధికారులు దాదాపు రూ.150 కోట్లకు ఎస్టిమేషన్ తయారు చేసి నివేదికను అందించారు. ఈ ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చితే 64 వేల ఎకరాలకు హంద్రీనీవా కింద కర్నూలు జిల్లాలో పూర్తిస్థాయిలో నీటిని అందించవచ్చు. ప్రతిపాదన వేయించడంలో ఉన్న ఉత్సాహం అమలులో మాత్రం నిరుత్సాహం అనాశక్తి, ఆశ్రద్ధ, ఉన్నాయని అధికారులపై మంత్రులపై, అపవాదు మాత్రం చిరస్థాయిగా మిగిలింది.

చెరువులకు నేటికీ ఇవ్వలేదు

- గంధం రాముడు, బొందిమడుగు, తుగ్గలి మండలం.

హంద్రీనీవా నుండి చెరువులకు నీటిని అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ఇక్కడ అది సాధ్యం కావడం లేదు. ఒక నెల క్రితం నీరు చెరువుకు అందించినట్లే అందించి మరల నీరు ఇవ్వడం లేదు. ఏమిటని అడిగితే ఇది కేవలం ట్రైల్ అని అధికారులు చెపుతున్నారు. చెరువు కింద ఆశపడి పంటలు వేసిన ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

హంద్రీనీవా ఆశతో పంటలన్నీ నాశనం

- వడ్డే నాగరాజు, రైతు, బొందిమడుగుల.

బొంది మడుగుల చెరువు కింద 150 ఎకరాలు సాగు భూమి ఉంది, హంద్రీనీవా నుండి నీరు వస్తాయని ఆశించి చుట్టుపక్కల రైతులు చాలా మంది వివిధ రకాల పంటలు వేసుకున్నాం. నీరు రాకపోవడంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయి. పంటలన్నీ నాశనం అయ్యాయి. అధికారులు, ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదు.

బిల్లులు ఇవ్వనందుకు నీళ్లు నిలిపారు

- పురుషోత్తం హంద్రీనీవా ఇఇ

హంద్రీనీవాకు ఆపరేషన్ అండ్ మెంటేనేన్స్ బిల్లులు ఇవ్వనందున మొన్నటి దాకా నీరు నిలిపారు. ప్రస్తుతం నీళ్లు వస్తున్నాయి. సమృద్ధిగా నీళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.



బనవాసిలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

వలసలు అరికట్టడంలో విఫలం

- ఉపాధి హామీ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం
- వలసలను ఆపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వలసలను అరికట్టడంలో విఫలమయ్యారని ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బనవాసిలో ఎమ్మిగనూరు, ఆలూరు క్లస్టర్లలోని 9 మండలాల్లోని ఉపాధి హామీ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ముఖ్య ఉద్దేశం గురించి ఉపాధికి సంబంధించిన అధికారులనే ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఉపాధి హామీ చట్టం ముఖ్య ఉద్దేశం సుస్థిరమైన అభివృద్ధి, పేదరికం లేకుండా చేయడం, భూములు సారవంతం చేయడం, నీరు వృథా కాకుండా చేసి గ్రామీణ రైతులకు తమ పంట పొలాలు సీజన్ లేకున్నప్పుడు వారు వలస వెళ్లకుండా వారి ఉపాధి కోసం డకౌట్స్, ఫారం పాండ్స్, చెక్ డ్యాం, మట్టి కట్టలు నిర్మించడం అని కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయిలో ఆ స్థాయి గురించి ఆలోచించి పని చేయాలని, మండలానికి నెలకు రూ.4 లక్షల వేతనం ఇస్తున్నారని తెలిపారు. గ్రామంలో వలస వెళ్లకుండా వాళ్లను అభివృద్ధి చేయడంలో ఎందుకు విజయం సాధించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఆలోచించి ఎలా సంపాదించాలనేది కాకుండా గ్రామీణ ప్రాంతంలో పొట్ట చేత పట్టుకొని వెళ్తున్న వాళ్ల పరిస్థితిలో తాము ఉంటే ఎలా ఉంటుందో రియలైజ్ కావాలని చెప్పారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించండి: కలెక్టర్

పెద్దకడబూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశించారు. పెద్దకడబూరులోని సచివాలయం-1లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని కూలీలు పత్తి పంటను తీయడానికి తెలంగాణ రాష్ట్రానికి వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసలను అరికట్టేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వలసలు వెళ్లొద్దని, పనులు కల్పిస్తామని సూచించారు. కూలీలకు సరైన వేతనం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వలసల నివారణకు ప్రత్యేక చర్య తీసుకోవాలని సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి
- ప్రజా సంఘాల నేతలు డిమాండ్
- గో బ్యాక్ మోడీ నినాదాలతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విశాఖపట్నంలోని ఉక్కు పరిశ్రమలో ప్రైవేటీకరణ ఆపాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖకు వస్తున్న సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఐద్వా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'గోబ్యాక్ మోడీ' అంటూ నిరసన తెలిపారు. సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శిలు సిహెచ్.సాయిబాబా, జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్‌దేశాయి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి నాగన్న మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తూ కార్మికులు జీవితాలను రోడ్డున పడేస్తున్నారన్నారు. ఉక్కు పరిశ్రమకు ప్రభుత్వమే గనులుకేటాయింపు చేసి 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడిపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. విభజన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రధానిని నిలదీయాలన్నారు. బిజెపికి అధికార పార్టీ ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేనలు కొమ్ముకాయడం తగదన్నారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ఈ పార్టీలను ప్రజలు ప్రతిఘటిస్తారని వారు హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్ , ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు ప్రసంగించారు. సిఐటియు జిల్లానాయకులు పి.నిర్మల, ఎం.గోపాల్, ఎం.విజయ్, టి.రాముడు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

ట్రాఫిక్ డీఎస్పీగా నాగభూషణం బాధ్యతలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పిగా నాగభూషణం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్‌ను ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బదీలీల్లో భాగంగా అసిస్టెంట్ కమాండెంట్‌గా 2వ ఎపిఎస్‌పి బెటాలియన్‌లో పని చేస్తున్న నాగభూషణంను కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పిగా బదీలి చేశారు. ఆయన 1991 లో ఎస్‌ఐగా పోలీసుశాఖలో చేరారు. 2004 లో సిఐగా పదోన్నతి పొందారు. 2020 లో డిస్‌పిగా పదోన్నతి పొందారు. ఇంటెలిజెన్స్, సిఐడి, ఎసిబి, కర్నూలు, కడప జిల్లాలో పని చేశారు.

కుల వివక్ష నిర్మూలన కోసం కెవిపిఎస్ ఆవిర్భావం

- బడుగు, బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం పోరాటం
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప - ఘనంగా కెవిపిఎస్ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - మంత్రాలయం

సమాజంలో కొన సాగుతున్న కుల వివక్ష నిర్మూలన కోసం కెవిపిఎస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) ఆవిర్భవించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షులు దేవసహాయం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో కెవిపిఎస్ 6వ కర్నూలు జిల్లా మహాసభలను నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల కార్యదర్శి బి.అనిల్ అధ్యక్షత వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మహనీయుల ఆశయ సాధనకు కోసం పోరాటాలు చేస్తామని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి టిటిడి కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీగా బయల్దేరి కెవిపిఎస్ జెండాను రాష్ట్ర నాయకులు ఓ.నల్లప్ప ఆవిష్కరించారు. అనంతరం మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కెవిపిఎస్ ఆవిర్భవించిన 24 సంవత్సరాల తర్వాత మంత్రాలయంలో జిల్లా మహాసభ జరుపుకోవడం జరిగిందని తెలిపారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసిన ఏకైక సంఘం అని చెప్పారు. ముందుండి పోరాడే సంఘంగా ఈ జిల్లాల్లో కెవిపిఎస్ ఉందన్నారు. అనేక సమస్యలపై మహాసభలో చర్చించి కార్యాచరణ రూపొందించుకొని రానున్న కాలంలో ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం, ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ నాయకులు ఆంధ్రయ్య, మారెప్ప, సురేష్, దేవ, ఇశ్రాయేలు, నాగన్న, రాము, సామ్సన్, దేవదాసు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తూ మాట్లాడుతున్న నాయకులు



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిగడపకు సంక్షేమ పథకాలు అందిస్తూ జనరంజకమైన పాలన కొనసాగిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 34వ వార్డు 86వ సచివాలయం సంపత్‌నగర్, మయూరినగర్, హేమలత నగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలలోని ప్రతి గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. స్థానిక వార్డ్ కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు సాపురు మాధురి, గాజుల శ్వేతారెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, కల్లూరు మండల సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోలు గోపాల్ రెడ్డి, వైకా పా యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, దిశ కమిటీ మెంబర్ ఎరుకల రాజు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సాయి సుబ్బయ్య రవీంద్ర స్కూలులో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న పిబివి.సుబ్బయ్య

కర్నూలు మాధవి నగర్‌లో రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు , రెవెన్యూ కాలనీలో రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్స్ క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య మాట్లాడుతూ క్విజ్ పోటీలు నిర్వహించడం వలన విద్యార్థులలో సృజనాత్మక శక్తి , పోటీతత్వం మెరుగుపడుతుందన్నారు. ఈ క్విజ్‌లో సబ్ జూనియర్స్, జూనియర్స్ టీంలుగా విభజించారు. సబ్‌జూనియర్స్‌లో ఎనిమిది టీమ్స్ , జూనియర్స్ 8 టీమ్స్ పాల్గొన్నారు. ఇందులో ప్రథమస్థానాన్ని సబ్ జూనియర్స్ లిల్లీ గ్రూపు చరణ్, రుత్విక్, శ్రీహన్, శ్రీలాస్య, వైష్ణవి, నిహారిక విద్యార్థులు , జూనియర్స్‌లో మదర్ థెరిస్సా గ్రూపు రోహిణి, లోహిత్, నవ్య, సాయిచరిత, సుఫియాన్, రేఖ విద్యార్థులు ప్రథమస్థానాన్ని సాధించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.ప్రదీప్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పి.పావని, శారద, సౌజన్య , అధ్యాపక బృందం పాల్గొని క్విజ్ పోటీల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధి అందరి బాధ్యత

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గ్రంథాలయాల అభివృద్ధి మన అందరి బాధ్యత అని, గ్రంథాలయాల వారోత్సవాలను జయప్రదం చేయాలని గ్రంథాలయ సంస్థ కర్నూలు చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం.సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, ఈనెల 14న బాలల దినోత్సవం రోజున ప్రారంభ వేడుకలకు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంఎ హాఫీస్ ఖాన్, డాక్టర్ జె. సుధాకర్, పాఠశాలల విద్యార్థులతో తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గాడి చర్ల హరిసరోత్తమరావుకు పూలమాలల అలంకరణ అనంతరం సభ నిర్వహిస్తామని తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తకపఠన ప్రాముఖ్యత గురించి వివరిస్తారన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు కీర్తిశేషులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టరం ఎస్ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణంలను స్మరించుకుంటూ జిల్లా గ్రంథాలయంలో పనిచేసిన మాజీ చైర్మను సన్మానిస్తామన్నారు. 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు ఉంటాయన్నారు. 18న పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ , క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. 19న దిశా చట్టం , మహిళా సాధికారతపై మహిళ డిఎస్‌పి ఎం .వెంకటాద్రి పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం, జాతీయ గ్రంథాలయ ముగింపు వేడుకలు సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ అందజేస్తారని తెలిపారు. శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధికార్యక్రమాలను వివరించారు.



మాట్లాడుతున్న గ్రంథాలయ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్



పట్టుబడిన బియ్యం లారీతో విజిలెన్స్ అధికారులు, నిందితులు

220 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కర్నూలు క్రైం: అక్రమంగా తరలిస్తున్న 220 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాల రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు ఆఫీసరు (విజిలెన్సు) ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. వారికి వచ్చిన సమాచారం మేరకు విజిలెన్సు అధికారులు నంద్యాల మండలం అయ్యలూరుమెట్ట వద్ద పిడిఎస్ బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా 450 బస్తాల (220.50 క్వింటాళ్ల)లను స్వాధీనం చేసుకొన్నారన్నారు. బియ్యాన్ని నంద్యాల ఎంఎల్ఎస్ పాయింట్లో అప్పగించి, నంద్యాల తాలుకా అర్బన్ పోలీసు స్టేషన్‌లో కేసునమోదు చేశామన్నారు. అక్కడ దొరికిన లారీ ఓనరు బోగినేని చిరంజీవి, డ్రైవరు బొందిలి హనుమాన్ సింగ్, క్లీనరు జాగర్లమూడి జగదీష్ పిడిఎస్ బియ్యం వ్యాపారి దర్శి కోటేశ్వరరావులను, లారీని స్టేషన్‌లో అప్పగించారన్నారు. ఈ దాడిలో విజిలెన్సు సిఐ కేశవరెడ్డి, విజిలెన్సు తహసీల్దార్ వెంకటనారాయణ, విజిలెన్సు ఎస్ఐ హనుమంతయ్య, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తాహసీల్దార్ శ్రీనివాసులు, విజిలెన్సు కానిస్టేబుళ్ల జమాల్‌షా, భరత్‌లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్ర మరువలేనిది

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



అబుల్‌కలాం జయంతిలో మన్సూర్ రహిమాన్ ,తదితరులు

స్వాతంత్ర పోరాట వీరులలో ముస్లింలు ఘనమైనా పాత్ర పోషించారని విశ్రాంత ప్రొఫెసర్ మాన్సూర్ రహిమాన్ కొనియాడారు. శుక్రవారం అవాజ్ కమిటి ఆధ్వర్యంలో మౌలాన అబుల్ కలాం అజాద్ 135 వ జయంతిని ఘనంగా ఓల్డ్ సీటీ కార్యాలయంలో అవాజ్ నగర కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ప్రొఫెసర్ మన్సూర్ రహీమాన్, ప్రిన్సిపాల్ నిసార్ అహమ్మద్ లు మాట్లాడుతూ స్వాతంత్ర అనంతరం భారత ప్రభుత్వంలో తొలి విద్యా శాఖా మంత్రిగా పని చేశారని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడించారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించిందన్నారు. తాను స్వతహాగా కవి, రచయిత కావడం ఈ దేశానికి ఎంతో ప్రయోజకరంగా ఉండేదన్నారు. ఆయన సేవలను ఆనాటి నెహ్రూ ప్రభుత్వం కొనియాడిందని వివరించారు. అనంతరం మైనారిటీ కాలేజ్ లెక్చరర్ అంజాద్ అలీ, రిటైడ్ హెడ్‌మాస్టర్ అబ్దుల్ సత్తార్ అబుల్ కలాం ఆజాద్ సేవలు గురించి కొనియాడారు. ఎస్ఏ రైటింగ్ , డ్రాయింగ్‌లలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం ఫస్ట్, సెకండ్ థర్డ్ ప్రైజ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర కమిటీ నాయకులు ఇంతియాజ్, సయ్యద్ ఆహ్మద్, ఎస్ఎండి.షరీఫ్, ఇలియాస్ , చాంద్‌బాషా, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు



ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మౌలానా అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవం పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిల్వర్ జూబ్లీ కళాశాలలో నగరంలోని స్థానిక సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసులు పాల్గొని అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి అధ్యాపకులు అక్తర్ భాను, పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో: జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.కళావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు , సీనియర్ న్యాయవాది వై.జయరాజు పాల్గొని అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూర్వ విద్యార్థుల కార్యదర్శి ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్, సీనియర్ సభ్యులు ఆడమ్, అజయ్ కుమార్, రమణయ్య, ఇషాక్, ,కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీలో వేరుశనగ, శనగ విత్తనాలను అందుకోండి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో రబీ సాగుకు ప్రభుత్వం నుండి వేరుశనగ, శనగ సబ్సిడీ విత్తనాలను అందుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం బ్యాతోలిలో రబీ సాగులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులోనే నకిలీ పత్తి విత్తనాలతో నిండా మునిగామని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎఒతో రైతులు వాపోయారు. ఇక్కడే శాస్త్రవేత్తలు నివేదికలను ప్రభుత్వానికి అందించారని న్యాయం జరుగుతుందన్నారు. రబీ సాగులపై ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని తెలిపి వేరుశనగ, శనగ విత్తనాలను రైతులకు పంపిణి చేశారు.

దోమల నిర్మూలనకు హైపో ద్రావణం పిచికారి

మద్దికెర-ప్రజాశక్తి :

మండల కేంద్రమైన మద్దికెర గ్రామ వీధులలో శుక్రవారం మలేరియా, డెంగ్యూ దోమల నిర్మూలనకు బ్లీచింగ్ పౌడర్, సోడియం క్లోరైడ్, హైపో ద్రావణం , వేపనూనె కలిపి గ్రామ వీధులలో స్ప్రే చేయించామని సర్పంచ్ బండారి సుహాసిని అన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రజలకు సూచనలు చేశారు.

మార్చిలోపు నిర్మాణాలు పూర్తి చేయాలి

- కెజిబివి స్కూల్‌లో ఎస్ఎస్ఎం ఎపిసి వేణుగోపాల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని కెజిబివి పాఠశాలలో పనులను మార్చిలోపు పూర్తి చేయాలని ఎస్ఎస్ఎ ఎపిసి కె.వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం హాలహర్వి మండలం కెజిబివి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.60 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. మొదటి విడతగా రూ.40 లక్షలు విడుదల చేసిందని, మార్చిలోపు నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం ఎందుకు తక్కువగా ఉందని ఎస్ఒను ప్రశ్నించారు. కార్తీక పౌర్ణమి, గౌరమ్మ పండగను గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా జరుపుకుంటారని, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి నుంచి తీసుకెళ్లారని ఎస్ఒ వివరించారు. జిల్లా అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎపిసి సూచించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రిజిష్టర్లు, రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేసి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు.


తనిఖీ చేపడుతున్న వేణుగోపాల్

హామీలు నెరవేరుస్తున్న సిఎం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఫారెస్టు లైన్ అవాజిపేటలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని ప్రభుత్వ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాలకు డబ్బులు కట్టిన నిరుపేదలకు అందిస్తామన్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడపుకుంటున్నాయని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, మురళీ రెడ్డి, స్టేట్ డైరెక్టర్లు మంజుల, అహ్మద్ బాష, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, కౌన్సిలర్ సురేష్, కిషోర్, సుధాకర్, ధర్మన్న, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సచివాలయ సిబ్బంది నరసన్న, ఆనంద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పలు పనులకు భూమిపూజ చేసిన ఎర్రకోట

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించడమే 'గడపగడపకు మనం ప్రభుత్వం' ధ్యేయమని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గంజిహళ్లి, ఐరన్‌బండ గ్రామాల్లో పలు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంజిహళ్లి గ్రామంలో ఎస్సీ నగర్, ఐరన్ బండ గ్రామంలోని ప్రధాన వీధిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలతో చేపట్టే పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, గంజహళ్లి తిరుమలరెడ్డి, మహేష్ రెడ్డి, ఐరన్ బండ మునీశ్వర రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, వైసిపి యూత్ నాయకులు బందే నవాజ్, మండల కన్వీనర్ దొరబాబు నాయుడు, భాస్కర్ రెడ్డి, గంజిహళ్లి సర్పంచి తోలు


భూమి పూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

టమోటా ధర పతనం

- కిలో రూ.2 - రైతు గగ్గోలు
- పలు ప్రాంతాల్లో పెరిగిన దిగుబడులు

ప్రజాశక్తి - ఆస్పరి

టమోటా ధర రోజురోజుకూ పడిపోతుండడంతో సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెల రోజుల క్రితం ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ధర పడిపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. గతంలో బాక్సు (25 కిలోలు) ధర రూ.500 పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కోత కూలిలు, రవాణ ఖర్చులు, కమీషన్ పోను రైతుకు ఏమాత్రం మిగలకపోవడంతో నష్టపోతున్నారు.


మార్కెట్‌లో టమోటాను విక్రయిస్తున్న రైతులు

జిల్లాలో పెరిగిన టమోటా సాగు

2010 సంవత్సరం కంటే ముందు జిల్లాలో టమోటా సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల్లో టమోటాను సాగు చేసేవారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నాటు రకమైన టమోటాను సాగు చేసేవారు. రాష్ట్రంలోని మదనపల్లి, అనంతపురం, కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి తదితర ప్రాంతాల్లో హైబ్రిడ్ రకం టమోటా సాగు చేయడం వల్ల ఎక్కువగా దిగుబడితో పాటు నాణ్యమైన పంట దిగుబడులు వస్తున్నాయి. మన ప్రాంతంలో సాగు చేసిన పంటకు డిమాండ్ తగ్గడంతో ప్రతేడాది సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం మన ప్రాంతంలో కూడా హైబ్రిడ్ రకం టమోటా సాగు చేయడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లాలో ఆదోని, ఆస్పరి, పత్తికొండ, ప్యాపిలి, డోన్ తదితర ప్రాంతాల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో టమోటాను సాగు చేస్తున్నారు.

పలు ప్రాంతాల్లో పెరుగుతున్న దిగుబడులు

అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు టమోటా పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. ఆ సమయంలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కొన్ని రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని మదనపల్లి, అనంతపురంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి తదితర ప్రాంతాల్లో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి.

20 లారీలకు పైగానే దిగుబడులు

జిల్లావ్యాప్తంగా చూస్తే ఆస్పరి మండలంలో ఆస్పరి, బిల్లేకల్లు, బిణిగేరి, కైరుప్పల, పత్తికొండ మండలంలో అట్టికెల గుండు, ప్యాపిలి, డోన్, దేవనకొండ, ఆదోని తదితర ప్రాంతాల మార్కెట్లలో వ్యాపారులు టమోటాను కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ మార్కెట్ల ద్వారా 20 లారీలకు పైగా టమోటాను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన టమోటాను వ్యాపారులు ప్రధానంగా హైదరాబాదు, సికింద్రాబాద్ మార్కెట్లలో విక్రయిస్తారు. ఈ రెండు నగరాల్లో దాదాపు 15కి పైగా మార్కెట్లకు ఎగుమతులు చేస్తారు. ప్రస్తుతం ఆయా మార్కెట్లలో బాక్స్ ధర రూ.300లోపే పలుకుతోందని వ్యాపారులు పేర్కొన్నారు.

రూ.40 వేల పెట్టుబడి పెట్టాను

- తెవుల ఎర్రిస్వామి, రైతు, ఆస్పరి



రూ.40 వేల పెట్టుబడి పెట్టి 1.5 ఎకరాల్లో టమోటా సాగు చేశాను. ధర పతనం కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు.


రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టుకొమ్మలు

చెట్టు కొట్టారు సరే... మరి తొలగించరా..?

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి బస్టాండ్ ఆవరణంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలు అడ్డంగా ఉన్నాయని పది రోజుల క్రితం చెట్టు కొమ్మలను కొట్టేశారు. కొట్టేసిన కొమ్మలు రోడ్డుకు అడ్డంగా ఉన్నప్పటికీ వాటిని తొలగించలేదు. ఈ చెట్టు కొమ్మలు పడి ఉన్న పరిధిలోని కెనరా బ్యాంకు, మీసేవ, ఫొటో స్టూడియో ఉన్నాయి. అధికంగా జనసంచారం ఉంటుందని, అయినా పట్టీపట్టనట్టు తిరుగుతున్నారని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నలంద విద్యా సంస్థల చైర్మన్ మహానందయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అజిత్, పట్టణ కార్యదర్శి విజయ్ కోరారు. డిసెంబర్ 2న ఎమ్మిగనూరులో జరిగే ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభల కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని నలంద విద్యాసంస్థల చైర్మన్ మహానందయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో దోపిడీలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తూనే ఉంటుందని చెప్పారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నవీన్, ప్రతాప్, సురేష్ పాల్గొన్నారు.


సాగునీరందిస్తున్న నాయకులు

కష్టకాలంలో సాగునీరు

- నాయకునికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాల్వ కింద సాగునీరందక రైతులు కష్టాలు పడ్డారు. 25 రోజుల నుంచి సాగునీరు లేకపోవడంతో పత్తి, మిరప, వరి పంటలు ఎండుముఖం పట్టాయి. చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో తన సొంత చెరువులోని నీటిని రైతుల పంట పొలాలకు అందించి రైతుల కష్టాల్లో పాలుపంచుకున్నారు. మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో మాజీ మండల అధ్యక్షులు చందా ఖాన్ సోదరుడు టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా తన సొంత చెరువులో ఉన్న నీటిని రైతులు పంట పొలాలకు తీసుకెళ్లండని చెప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 100 ఎకరాల మిరప పంటకు సాగునీరు అందించారు. ఉప్పరహాల్, కౌతాళం రైతులు సాగునీరందించి ఎండిపోతున్న పంటలను కాపాడుకున్నారు. సాయిబాబాకు చెందిన రెండు చెరువుల ద్వారా నీటిని పొలాలకు తీసుకెళ్లినట్లు రైతులు పేర్కొన్నారు. తమ పంట పొలాలకు నీరు సాయి బాబాకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని వైఎంకె హై స్కూల్ విద్యార్థులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐఎంఎ డాక్టర్లు గోపీనాథ్, రఘునాథ్, హరీష్, సందీప్, కిరణ్ కుమార్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శరీరం ఎదుగుదల దశలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని, అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు, ఐఎంఎ అధ్యక్షులు ఉషా రావు, కార్యదర్శి కిరణ్ కుమార్, స్టేట్ కమిటీ మెంబర్ కృష్ణమూర్తి, హరీష్, సభ్యులు సైపుల్లా, వినయ్, మధుసూదన్ పాల్గొన్నారు.

ఆదోనిలో షాదీఖానా పూర్తి చేయాలి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో విక్టోరియా పేటలో మాహ్మద్ అలీ పార్కులో అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను పూర్తి చేయాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోని పట్టణ ముస్లిం, మైనార్టీల కోసం 2019లో ఎంపీ నిధులు రూ.కోటి, మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. షాదీ ఖానాను నిర్మించాలని టిడిపి హయాంలో 2019లో శంకుస్థాపన కూడా జరిగి నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పారు. ప్రజా ప్రతినిధి నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యం వల్ల ముస్లిం, మైనార్టీలు షాదీఖానాను ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. నిధులు మంజూరైనా వినియోగించడంలో అధికారులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు వడ్డెమాను గోపాల్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, ఆదోని పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు ఎమ్‌డి.హుస్సేన్, సాధిక్ వలీ, సయ్యద్ వసీం ఖాద్రీ, అబ్దుల్, టిడిపి 36వ వార్డు ఇన్‌ఛార్జీ కురువ హనుమంతు, 35వ వార్డు ఇన్‌ఛార్జీ విజయకుమార్, కర్నూలు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు రామకృష్ణ ఉన్నారు.


అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గుడిసె కృష్ణమ్మ

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి- దేవనకొండ

వేసవి రాకముందే రబీ సీజన్‌లోనూ జిల్లాలో విపరీతంగా వలసలు ఉన్నాయని, వలసల నివారణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ విమర్శించారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో వ్యకాస 2వ మండల మహాసభ జరిగింది. ముందుగా సంఘం పథకాన్ని వ్యకాస సీనియర్ నాయకులు కెపి.రాముడు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవి.నారాయణ, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బి.వీరశేఖర్ మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో 20 రోజులుగా వలసలు పెరిగాయని తెలిపారు. ఉపాధి పని



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పెట్టాల్సిన సిబ్బంది చేతులెత్తేసిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. వ్యకాస, ప్రజా సంఘాల నాయకులు పరమేష్, బజారి, శ్రీరాములు, సూరి, అశోక్, బడే, ఓంకార్, దస్తగిరి, కౌలుట్ల, రాముడు పాల్గొన్నారు.

వ్యకాస మండల కమిటీ ఎన్నిక : అధ్యక్షులుగా ఎం.నాగేష్, కార్యదర్శిగా ఎం.మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులుగా యూసుఫ్ బాష, సి.బజారి, సహాయ కార్యదర్శులుగా కరివేముల రాముడు, కోటకొండ రాముడు, మరో 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గుర్తింపు కార్డులున్న కళాకారులకు ఇంటి పట్టాలు కేటాయించాలి

- రాయలసీమ కళా వేదిక నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గుర్తింపు కార్డులున్న కళాకారులకు ఇంటి పట్టాలు కేటాయించాలని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ అనుబంధ రాయలసీమ కళావేదిక నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం కళా వేదిక జిల్లా అధ్యక్షులు రామ్ చరణ్, రామాంజనేయులు మాట్లాడారు. పద్యనాటకం, కోలాటం, భజన, చెక్కభజన, గొరవయ్యలు, యక్షగానంలాంటి కళారూపాలు ఆదోని ప్రాంతంలో అనాదిగా వస్తున్నాయని తెలిపారు. అనంతరం ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎసి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. కళాకారులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. ఎలాంటి షరతులూ లేకుండా కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. సంగీత పరికరాల కొనుగోలుకు 90శాతం సబ్సిడీతో ప్రభుత్వ రుణం అందించాలని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు నరసింహలు, కమిటీ కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు ప్రతాప్, రవి, అనిల్, నవీన్, ఎస్‌విఎస్ జిల్లా అధ్యక్షులు బాలు, కళా వేదిక నాయకులు పురుషోత్తం, తిక్కన్న పాల్గొన్నారు.



బాణసంచా అమ్మకాల్లో ఎస్ఐ చేతివాటం..?

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో ఎస్ఐ అబ్దుల్ జహీర్ బాణసంచా అమ్మకాల వ్యాపారులతో మామూళ్లు తీసుకుని వ్యాపార నిర్వహణకు సహకరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హోళగుందలో దాదాపు ఆరుగురికి పైగా వ్యాపారులు బాణసంచా అమ్మకాలు చేపట్టారు. గౌరమ్మ పండగ సందర్భంగా రెండురోజులపాటు బాణసంచా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ రెండు రోజుల్లోనే లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఒక్కో వ్యాపారి నుంచి ఎస్ఐకి రూ.వేలల్లో ముడుపులు అందినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరుకు సందుల్లోని అంగళ్లలో బాణసంచా అమ్మకాలు నిర్వహించినా చూసీచూడ నట్లు వ్యవహరిస్తున్నారంటే అమ్మకాలకు అండదండలు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎంత మేరకు నష్టం జరుగుతుందని తెలిసినా అధికారులు ఉదాసీనతగా ఉన్నారంటే విధుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్లపై నివేదిక : జనసేన

మంత్రాలయం : నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై నివేదిక పంపాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న తెలిపారు. శుక్రవారం ఆయన జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని జగనన్న కాలనీల్లో 18.63 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారని అన్నారు. ఇంతవరకు కేవలం 1.52 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కల్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 12, 13, 14న జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాల స్థితిగతులను చూసి ఫొటోలను తీసి పంపుతున్నట్లు తెలిపారు. శనివారం నుంచి ఆ పనిలో నిమగ్నం అవుతున్నట్లు చెప్పారు. జనసేన నాయకులు బివి.రవిచంద్ర, బిబిసి చిన్న, ఆది, వెంకటేష్, నరసప్ప, ఉదయ్ పాల్గొన్నారు.

ఊసే లేని విభజన హామీలు

- వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, మోడీ అధికారం చేపట్టి 8 ఏళ్లు దాటినా విభజన హామీల ఊసే లేదని వామపక్ష నాయకులు విమర్శించారు. ఎపి విభజన హామీలు నెరవేర్చని ప్రధాని నరేంద్ర మోడీ విశాఖకు వస్తున్న సందర్భంగా వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు సుదర్శన్, లక్ష్మన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మహానంద రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మిరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మల్లికార్జున, మునెమ్మ మాట్లాడారు. విశాఖ రైల్వే జోన్ ప్రకటనలకు పరిమితమైందన్నారు. ఎపికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా భావించే పరిశ్రమలను నరేంద్ర మోడీ కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి తగిన రీతిలో ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకోవాలని కోరారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, లక్ష్మీనారాయణ, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు, ప్రకాష్, హుసేని, సిపిఐ పట్టణ నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, కొత్తూరు ఈరన్న, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు విరుపాపురం నరసప్ప, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి గిరి మలప్ప, భీమేష్, సిపిఎం నాయకులు ఈరన్న, లింగన్న, గోపాల్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సోమప్ప సర్కిల్‌లో 'గో బ్యాక్ మోడీ' అంటూ కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీ నిర్వహించి, నిరసన చేపట్టారు. సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ నాయకులు రాముడు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాజు, సిపిఎం నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, రాజు, సురేష్, భీమరాజు, అజిత్, రమేష్, కృష్ణ, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్, సత్తన్న, బాలరాజు, సమీయుల్లా, చిన్నన్న, రాజీవ్, విజయేంద్ర, రంగస్వామి, వీరేష్, తిమ్మ గురుడు, రామాంజి, విజయ్, నరసింహులు, సుంకన్న, సమీర్, సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు ప్రసాద్, ఏసోబు పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)** మండలంలోని సిపిఎం, సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. సిపిఎం, సిపిఐ మండల నాయకులు రాముడు, గోపాల్, సిపిఎం నాయకులు వీరేష్, కర్రెప్ప, రంగయ్య, ప్రజా సంఘాల నాయకులు కొరివి హనుమంతు, తాయన్న, వెంకటేష్, కురువ నరసింహులు పాల్గొన్నారు.



ఆదోనిలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు


మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి సుభాన్

ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి సుభాన్

ప్రజాశక్తి - కౌతాళం

దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి సుభాన్ తెలిపారు. శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆజాద్ దేశం కోసం, విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆవాజ్ కమిటీ నాయకులు మహబూబ్ బాషా, ఖాజా హుస్సేన్, కోసిగి బాష, పీరా పాల్గొన్నారు.

ప్రతిభ హైస్కూల్‌లో : స్థానిక ప్రతిభ హై స్కూల్‌లో జాతీయ విద్య దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, కార్యదర్శి మైనుద్దీన్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో రెహనుమా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంఇఒ వినోద్ కుమార్, మాజీ సర్పంచి రహమతుల్లా, వైసిపి యువ నాయకులు బందే నవాజ్, ప్రభుత్వ ఆయుష్ యునాని వైద్యులు డాక్టర్ ఖాద్రీ, రెహనా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్, ఉపాధ్యక్షులు మన్సూర్, ప్రధానోపాధ్యాయులు బతుకన్న, సైదాబాను, వైసిపి నాయకులు కనికే పద్మనాభం, సప్లయర్ రఫీక్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకూ సంక్షేమ పథకాలు

- వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రతిపక్ష నాయకులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపిదేనని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వగరూరు గ్రామంలో రెండోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వైసిపి యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డితో కలిసి గ్రామంలోని టిడిపి నాయకులు వీరారెడ్డి, శంకరమ్మ దంపతులకు అందుతున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించి, ఇప్పటి వరకు రూ.1,42,810 అందజేసినట్లు తెలిపారు. మరో టిడిపి కార్యకర్త నరసింహులు, శారదమ్మ దంపతులు ఇప్పటి దాకా రూ.1,23,236 లబ్ధి పొందారని చెప్పారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజ్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు వీరారెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి, కాంతా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సర్పంచి లింగా రెడ్డి, ఎంపిటిసి చిన్నన్న పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి చెక్కు పంపిణీ

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని దిబ్బనదొడ్డి గ్రామానికి చెందిన రైతు కురువ మహానంది మే 17న ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహాయంతో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతు కుటుంబానికి రూ.7 లక్షలు మంజూరు చేశారు. వగరూరులో నిర్వహించిన 'గడపగడపకు' కార్యక్రమంలో భాగంగా మృతుని భార్య కురువ సరస్వతికి చెక్కును అందజేశారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ జీరా గణేష్, విఎఎ హైమావతి పాల్గొన్నారు.


మంత్రాలయంలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రూ.55 లక్షలతో వంతెన నిర్మాణం

కౌతాళం : మండలంలోని బాపురం వంకపై రూ.55 లక్షలతో వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంతెన దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడే వారన్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు, మండల నాయకులు తన దృష్టికి తీసుకురావడంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు వినియోగంలో తీసుకొస్తామన్నారు. వైసిపి మండల నాయకులు అత్రి గౌడ్, నాగరాజ్ గౌడ్, ప్రహ్లాద చారి (దేశాయి), జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, రామన్న గౌడ్, గురునాథ్ రెడ్డి, దేవ్ రెడ్డి, పాల్ దినకరన్, అవతారం, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.


కౌతాళంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

అభివృద్ధికి మారుపేరు జగన్ మోహన్ రెడ్డి

- జగనన్న కాలనీల ఏర్పాటులో ఎమ్మెల్యే కృషి మరువలేనిది
- మంత్రాలయం సర్పంచి భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి మారుపేరని, జగనన్న కాలనీల ఏర్పాటులో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల కృషి మరువలేనిదని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీల్లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇల్లు నిర్మించుకున్న ప్రతి లబ్ధిదారునికీ సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్, భాస్కర్, జయరాం, రమేష్, జిమ్మి, రామాంజి, గురురాజ ఉన్నారు.

IN THE COURT OF THE 1ST ADDL JUNIOR CIVIL JUDGE :: KURNOOL

O.S. NO. 1057/2021

Sri.Himabindu Financier, Kurnool,
Rep by its, Proprietor,
B.Vasu Devaiah S/o Late. Seethaiah,
R/o Kurnool. ... Plaintiff

-Vs-

N.Nagaiah and another ... Defendants

SUMMONS OF DEFENDANT NO.2

Defendant no.2:
N.Satyanarayana S/o N.Nagaiah,
H.No. 51-1040-A2, Seetharama Nagar,
Kurnool Post and Dist, A.P.

Where as the plaintiff filed the above suit for recovery of amount Rs.11,76,000/- with cost and future interest under promissory note date. 30-09-2019 executed by the defendants.

You the 2nd defendant is hereby directed to appear before the court on date 19-12-2022 at 10.30 A.M. and to file your objection if any other wise you will be deemed to be set exparty.

By the order of the Hon'ble Court,
Dated 19-12-2022.

D.A.Anees Ahamed,
Advocate for Plaintiff

మహారాజ శ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.NO. 10/2022

మాకా. కవిత వగైరా ... వాదులు

-Vs-

G. కిరణ్ కుమార్ @ నాని ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

G. కిరణ్ కుమార్ @ నాని తండ్రి G. నెట్టికల్,
వ్యాపారం, R/o ఇంటి నెం. 45–24–K–43B,
టీచర్స్ కాలని, తనీష్ ఫంక్షన్ హాల్ వెనక ప్రక్క కర్నూలు.

పై నంబరు దావాలో వాదులు ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 48,62,710/– లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 24–11–2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 24–11–2022

A. **రామసుబ్బారెడ్డి**
K. **సిరిచందన**
వాదుల పరం న్యాయవాదులు
కర్నూలు.



సమగ్ర రీ సర్వేను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న భూహక్కు – భూ రక్షా పథకం కింద చేపట్టిన సమగ్ర రీ సర్వే పనులు నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్డిఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో 90 రోజుల ఇళ్ల పట్టాలు, మ్యూటేషన్ దరఖాస్తులు, చుక్కల భూములు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం, భూసేకరణ, తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి అన్ని మండలాల తాసిల్దారులు, ఆర్డీవోలతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న భూహక్కు భూ రక్షా పథకం కింద రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్డీవోలు, తాసిల్దారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ముసాయిదా ప్రకటన, రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మ్యూటేషన్ కరెక్షన్ దరఖాస్తులు, ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ రీసర్వేలో గ్రౌండ్ వ్యాలిడేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి విత్ ఇన్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కరించాలన్నారు. స్పందన వినతుల పరిష్కారానికి సంబంధించి రీఓపెన్ అయిన 12 సర్వీసులు , వితిన్ ఎస్ఎల్ఎ లో ఉన్న 66 సర్వీసులు, 24 గంటలు, నలబై ఎనిమిది గంటల్లో పరిష్కరించాల్సిన 10 సర్వీసులు, ఏపీ సేవా సర్వీసులో ఉన్న 42 దరఖాస్తులను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత తహసీల్దారులను ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జాతీయ రహదారుల భూసేకరణ, ఇతర సాగునీటి ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేకతను చేయాలని త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌లో ప్రొఫార్మా 5, 6లను పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్ లను ఆమె ఆదేశించారు. 90 రోజుల ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా పెండింగ్లో ఉన్న పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. వివిధ కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులు, పత్రికల్లో ప్రచురితమైన వ్యతిరేక వార్తలు తదితర 11 రెవెన్యూ అంశాలపై మండల తాసిల్దార్‌లు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంఛార్జి డిఆర్ఓ మల్లికార్జునుడు, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, యం.దాసు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి హరికష్ణ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, అన్ని మండలాల తహసీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి : కలెక్టర్




బహుమతులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సామూన్, ఎమ్మెల్సీ గంగుల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ పేద విద్యార్థులందరినీ పాఠశాలలకు పంపి చక్కటి విద్యాబోధన అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటనరీ హాలులో భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, డిఇఒ అనురాధ, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్, ఇతర మైనారిటీ నాయకులు అబ్దుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనబడి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్యా విధానంలో వినూత్న సంస్కరణలు తీసుకొస్తుందన్నా రు. జిల్లాలో మైనారిటీ విద్యార్థినీల అక్షరాస్యత శాతం తక్కువగా ఉందని, తల్లిదండ్రులు పిల్లలను బడులకు పంపి ప్రయోజకులను చేయాలన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొస్తోందన్నారు. కేరళ రాష్ట్రంతో సమానంగా ఆంధ్ర రాష్ట్రం ఉందని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ మైనారిటీలు అన్ని రంగాలలో ముందు ఉండాలనే ఉద్దేశంతోనే పెద్ద పీట వేసి మహిళనైన తనకు చైర్మన్ పదవి ముఖ్యమంత్రి ఇచ్చారన్నారు. అనంతరం వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సమావేశంలో నవభారత్ హుస్సేన్, ఎస్ఎండి సాధిక్, అబ్దుల్ మజీద్, జాకీర్ హుస్సేన్, సమ్మథ్, సలాముల్లా, మదాని, గఫూర్, అబ్దుల్ మజీద్, షరీఫ్, మహమ్మద్ ఇక్బాల్ ఇతర మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ప్రజాశక్తి - మహానంది

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు తెలియజేశారు. శుక్రవారం బుక్కాపురం గ్రామంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చెప్పిన విషయాలను తీర్మానం రూపంలో ప్రభుత్వానికి పంపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అదేవిధంగా మహానంది మండలంలో పంట నమోదు కార్యక్రమం పూర్తి అయిందని, సోషియల్ ఆడిట్, గ్రామసభలు కూడా నిర్వహించామని తెలియజేశారు. మహానంది వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు విజయభాస్కర్, రాహుల్ మాట్లాడుతూ వివిధ పంటలలో సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహానంది మండలంలో మూడు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రకతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ప్రకృతి వ్యవసాయంలో మెలకువలను తెలియజేస్తారని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పడని రైతులు, పొలం లేని సిసిఆర్సి కార్డ్స్ తీసుకున్న కౌలు రైతులు రైతు భరోసా కొరకు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధుల నివారణ గురించి తెలియజేశారు. బుక్కాపురం గ్రామ సర్పంచ్ వరలక్ష్మి , నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ మోహన్ రావు , క్రిస్టియానమ్మ, ఏఈఓ శ్రీనివాసరెడ్డి , రైతు భరోసా కేంద్ర సిబ్బంది మౌనిక , మధు, రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడిపై అంచనా

బండి ఆత్మకూర్ : పంట కోత ప్రయోగం ద్వారా రైతులకు తమ పంటల దిగుబడిపై ఒక అంచనా ఏర్పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు. శుక్రవారం ఏ కోడూరు గ్రామంలో ఒక రైతు పొలం నందు చదరపు ఐదు అడుగుల విస్తీర్ణంలో పంటను కోత కోసి పరిశీలించారు. 14. 78 6 కేజీలు ధాన్యం వచ్చిందని దీన్నిబట్టి ఎకరానికి 30 బస్తాలు దిగుబడి రావచ్చని అంచనా వేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రయోగం కార్యక్రమంలో వ్యవసాయ కోఆర్డినేటర్ మున్వర్, ఎస్బిఐ బ్యాంక్ కవిత, వీఆర్వో ఆదిశేషులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివప్రసాదరావు

చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని ప్యానెల్ న్యాయవాది శివప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ జైలులో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఐదవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శివ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన తో మెలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ సాల్వంత్ న్యాయవాదులు సుబ్బయ్య సుదర్శన్ తోపాటు జాకీర్ అజయ్ లు పాల్గొన్నారు.

ప్రతి సభ్యురాలు సంపాదించాలి : డిపిఎం

జూపాడుబంగ్లా: స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలు ఏడాదికి రూ. లక్ష ఆదాయం సంపాదించేలా అవగాహన కల్పించాలని డీపీఎం దానం సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఏపీఎం అంబమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో దానం మాట్లాడుతూ.. వచ్చే ఐదు సంవత్సరాల్లో మోడల్ మండలాలు ఏయే అంశాల మీద పని చేయాలో సూచించారు. ప్రతి గ్రామం నుంచి ఆదర్శ గ్రామ ఏర్పాటుకు శిక్షణలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో తీసుకున్న అప్పులు సక్రమంగా చెల్లించేలా ఏపీఎంలు, సీసీలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో 9 మండలాల ఏపీఎంలు, సీసీలు నాగన్న, సింగ్, జయ్ పాల్, జయి లక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లను త్వరగా ప్రారంభించాలి : పిడి

పాణ్యం : మండలములో మహిళా గ్రూపులు త్వరగా మహిళా మార్ట్‌లను ప్రారంబించాలని ,మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని డిఅర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి,పిషరిష్ డిపార్ట్ మెంట్ జెడి రాఘవ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. మండల అధ్యక్షురాలు హుస్సేన్ బీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ మహిళా శక్తిని చూపుతున్నారని అన్నారు. ఏపిఎం ప్రసాద్ మాట్లాడుతూ వివోఏలు పక్షపాతం లేకుండా మహిళా సంఘాలను అన్నింటినీ ఒకేవిధంగా చూస్తూ సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లు, ఓ బీ లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరలమ్మ, వి వో ఏ లు పాల్గొన్నారు.

ఏ మొహం పెట్టుకొని ప్రధాని ఎపికి వస్తున్నారు ?

- డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహమాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రధాని నరేంద్ర మోడీ ఏ మొహం పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారో రాష్ట్ర ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యా ల స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా ఆదుకున్నాం అని చెప్పడానికి వస్తున్నారా, పార్లమెంటులో విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను నెరవేర్చామని వస్తున్నా రా... విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో కష్టించి ప్రాణ త్యాగాల అనంతరం వచ్చిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రవేటికరణ చేయను అని చెప్పడానికి వస్తున్నారా... రాయలసీమకు ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ పూర్తిస్థాయిలో అమలు చేశామని వస్తున్నారా? రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పి రాష్ట్రానికి రావాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలో రావడానికి ముందు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేరుస్తానని చెప్పి, నేడు కేంద్రం ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి, పవన్ కళ్యాణ్ ముగ్గురు ఒకటేనని, రాష్ట్రానికి కావలసిన విభజన హామీలను ప్రశ్నించకుండా నరేంద్ర మోదీకి వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, నంద్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్ఎండీ ఫరూక్, పుల్లయ్య, రామకష్ణ, శివరాంరెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఆమరణ నిరాహార దీక్ష

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మానిపాటి మురళి



మాట్లాడుతున్నో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మానిపాటి మురళి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈ నెల 15 నుంచి నంద్యాలలో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు 20వ వార్డు వైసిపి కౌన్సిలర్, నంద్యాల జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు మానిపాటి మురళి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో గిరిజన నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను, జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని డిమాండ్ చేసినా ఇంతవరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్న దొర, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఖంభం రవి బాబు, ఎస్టి ఎమ్మెల్యేలు చోద్యం చూపుతున్నారని అన్నారు. ఇతరులకులాలను ఎస్టి జాబితాలో చేర్చడంపై స్పందించాలని, లేనిపక్షంలో నవంబర్ 15 నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత గిరిజన సమైక సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మధుబాబు, దలిత గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట రమణారావు, న్యాయవాది మానిపాటి రామకృష్ణ, దళిత గిరిజన సమైక్య నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు, బంగి ఎల్లయ్య, గిరిజన నాయకులు వెంకటరాముడు పోల సాలన్న, సుంకన్న, నాగరాజు, కాలింగిరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైడు కాలువలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని బొందలదిన్నె ఆకుమల్ల కానాల గ్రామాలలో సైడు కాలువలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సైడు కాలువలు లేకపోవడంతో మురుగునీరు సిమెంటు రోడ్లపై ప్రవహిస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. సీసీ రోడ్లు వేసి కూడా ఉపయోగం లేదని, ఎన్నోసార్లు ముసలి వారు, పిల్లలు జారీ కింద పడి గాయాల య్యాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సైడు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వైన్ షాపుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు : ఎక్సైజ్ ఎస్ఐ

బండి ఆత్మకూర్ : మండలంలోని వైన్ షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై సందీప్ యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ కృష్ణ కుమార్ ఆదేశాల మేరకుసంత జూటూరు వైన్ షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ సేల్స్ రిజిస్టర్ క్యాష్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపు నుండి బెల్టు షాపులకు మద్యం సీసాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఇటీవల బండి ఆత్మకూరు వైన్ షాప్ నందు పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడి మద్యం సీసాలను విక్రయించి నగదు జమ చేయకపోవడంతో వారిని విధులను తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళు వెంకటసుబ్బయ్య, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు దారి చూపండి : క్రిస్టియన్ జెఎసి

ప్రజాశక్తి - నంద్యాలరూరల్

క్రిస్టియన్స్ స్మశాన వాటికకు దారి చూపాలని క్రిస్టియన్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నాడు నంద్యాల పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం ముందు క్రిస్టియన్స్ జేఏసీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్స్ జెఎసి కార్యదర్శి మన్యం జానయ్య, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మయ్య, లింగస్వామి, నాగ శేషు ,మహమ్మద్ సలాం, , లింగ మనీ రాజు భాస్కర్ మాట్లాడారు. క్రిస్టియన్ జేఏసీ వారు అనేక రకాల పోరాట ఫలితంగా శ్యామ కాలువ పోరంబోకు స్థలాన్ని, 518 సర్వే నంబర్లు క్రిస్టియన్స్ స్మశాన వాటికకు అనుమతి ఇచ్చిందన్నారు. దాని పక్కన ఉన్న 517 నంబరు మాదే అని కొందరు భూకబ్జాదారులు స్థలంలో నుంచి పోయే హక్కు మీకు లేదని అడ్డు తగిలడం దారుణం అన్నారు. ఇన్ని సంవత్సరాల నుంచి మా స్మశానం లోకి శవాలను తీసుకొని పూడ్చుకుంటున్న ఎవరు అడ్డు తగలలేదని, నంద్యాల జిల్లా అయిన తర్వాత కొందరు భూకబ్జాదారులు రాజకీయ నాయకుల అండదండలతో ఈ దుశ్చర్యకు పూనుకుంటున్నారన్నారు. శామకాలువ స్థలాన్ని, స్మశాన వాటికను కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. స్మశాన వాటికను రక్షించుకునేందుకు దశలవారీగా కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

అవధాన కార్యక్రమంలో మాజీ ఎంపీ గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ రావు అవధాన కార్యక్రమంలో మాజీ ఎంపీ గంగుల పాల్గొన్నారు. అనంతరం ఆయన నేరుగా తమ కార్యాలయానికి చేరుకున్నా రు. ఈ సందర్భంగా ఆయనను క్రైస్తవ మత గురువులు కలిశారు. మీలాంటి నాయకుడు ప్రజలలోనే ఉండాలని ప్రార్థన నిర్వహించారు. అనంతరం ఆయన కార్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డినీ కలిసి మాట్లాడడం జరిగింది. గంగులతో పాటు కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట శ్రీనివాసరెడ్డి, అమర్ రెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సచివాలయాల ఉద్యోగుల

బదిలీలు ఇప్పట్లో లేనట్లేనా..?



ప్రజాశక్తి - నందికొట్కూరు

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఇప్పట్లో లేనట్లేనా?.. అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ కాగానే బదిలీలు ఉంటాయని ఆశించిన ఉద్యోగుల ఆశలు ఇప్పట్లో నెరవేరే అవకాశాలు కనబడం లేదు. దసరా కానుకగా బదిలీలు ఉంటాయని అందరూ ఆశించినప్పటికీ ఆచరణలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపడితే పరిపాలనపరంగా కొంతమేర అస్తవ్యస్త పరిస్థితులు నెలకొనే అవకాశాలుంటాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతేకాకుండా ప్రజా నిధులకు ప్రజల నుంచి వచ్చిన అర్జీలు గ్ర్యూకాట్ ని జరుగుతున్న నేపథ్యంలో అభివద్ధికి సంబంధించిన ప్రజా పాదనలు అమలు కుంటూ పడే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం సంక్రాంతి వరకైనా బదిలీల ప్రక్రియ చేపట్టకుండా ఉంటే మంచిదని పలువురులు ఎమ్మెల్యేలు, సీఎంఓ కార్యాలయంలోని అధికారులకు పలువురు ఎమ్మెల్యేలు విన్నవించుకుంటున్నారు అని సమాచారం. అయితే గ్రామ సచివాలయ ఉద్యోగుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఉద్యోగం వస్తుందని ఆశతో ఏ జిల్లాలో ఉద్యోగం దొరికితే ఆ జిల్లాకు వెళ్లామని.. కుటుంబము ,భార్య బిడ్డలు ఒకచోట,తాము ఒకచోట ఉన్నామని ఇటువంటి పరిస్థితుల్లో కుటుంబానికి దూరమయ్యామని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానసిక ఒత్తిడికి కూడా గురవుతున్నట్లు పలువురు చెబుతున్నారు. అలాగే ఇ.ఎస్.ఐ అమల్లోకి రాకపోవడం గ్రామ సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఆందోళనలకు గురిచేస్తుంది. ప్రభుత్వం ఇకనైనా తమ అభ్యర్ధనను పరిగణలోనికి తీసుకొని బదిలీల ప్రక్రియ చేపట్టాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నంద్యాల సబ్ డివిజన్లో

పెరిగిన వాణిజ్య పంటల సాగు..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో వరి సాగు తగ్గినప్పటికీ మిగిలిన పంటల సాగు పెరిగింది. 2022 ఖరీఫ్‌లో వరి సాగు 15 వేల ఎకరాల్లో తగ్గినట్లు సమాచారం. వరి తగ్గినప్పటికీ మిగిలిన వాణిజ్య పంటలు మిర్చి,సోయాబీన్, మొక్కజొన్న పంటల సాగు బాగా పెరిగినట్లు వ్యవసాయ శాఖ సబ్ డివిజనల్ అధికారి డి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 1,04,680 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయన్నారు. సాధారణ విస్తీర్ణము 1,01,317.5 ఎకరాలు కాగా 1,04,680 ఎకరాలలో పంట సాగు అయిందన్నారు. వరి 65 వేల 717.5 ఎకరాలు సాగు అయిందని, అలాగే మొక్కజొన్న 12.325 ఎకరాలు సోయాబీన్ 5.640 ఎకరాలు పత్తి 10, 515 ఎకరాలు, మిర్చి 10482.5 ఎకరాలు సాగు అయిందని ఈ ఏడాది మిర్చి, సోయాబీన్, మొక్కజొన్న సాగు బాగా పెరిగిందన్నారు. రైతులు పంట మార్పిడి పద్ధతులకు వస్తే మంచి ఫలితాలు ఉంటాయని అధిక దిగుబడులు సాధించి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చు అన్నా రు. ఈ క్రాప్ బుకింగ్ పూర్తి అయిందని ఈకేవైసీ ప్రక్రియ 103 శాతం అయిందన్నారు. సామాజిక తనిఖీలు చేయడంతో పాటు సూపర్ చెక్ కూడా చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



మాట్లాడుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

నంద్యాల అర్బన్ : క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలలో కోత విధించరాదని, పిఎఫ్, ఈయస్ఐ అమలు చేయాలని,పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు ఆటోలను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, పట్టణ కార్యదర్శి కె. మహమ్మద్ గౌస్‌తో పాటు క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సంకల్పం అనే నినాదంతో రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో చేపడితే ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నాయ న్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, అవి కూడా నెలల తరబడి పెండింగ్లో పెట్టడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12,500 చెల్లిస్తే ఆటో డ్రైవర్లకు కేవలం 8270 రూపాయల మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది నెలల అవుతున్న పిఎఫ్ అమౌంట్‌ను చెల్లించడం లేదని, క్లాఫ్ ఆటో డ్రైవర్‌కు ఏమైనా జరిగితే తమ కుటుంబాన్ని ఆదుకునే పరిస్థితుల్లో ఎవరూ లేరని పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కారం చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి స్పందించి ఏజెన్సీతో మాట్లాడి సమస్యల పరిష్కారం నకు కృషి చేస్తానని హామీ మేరకు వారు నిరసనను విరమించారు.



తనిఖీ నిర్వహిస్తున్న డిఎంపెచ్ఓ

లింగ నిర్ధారణ పరీక్ష చేస్తే కఠిన చర్యలు

- డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - బేతంచెర్ల

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆర్ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం నాడు బేతంచెర్ల పట్టణం లోని ప్రజా వైద్యశాల, శ్రీ వెంకట సాయి క్లినిక్, మమత హాస్పిటల్,ప్రైవేటు ఆసుపత్రులను డిఎంఅండ్‌హెచ్ ఓ వెంకటరమణ తనిఖీ చేశారు. తనిఖీలు నిర్వహించిన ఆసుపత్రుల్లో ఎక్రే మిషన్లు,ఆయా పరికరాలను పరిశీలించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ భ్రూన హత్యలను అరికట్టే బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. ప్రభుత్వ అందిస్తున్న వైద్య సేవలను సద్విని చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో. డాక్టర్ శివకుమార్, డాక్టర్ గురు కుమార్, ఏఎన్ఎంలు అమల,పుల్లమ్మ,హెల్త్ అసిస్టెంట్. రామాంజనేయులు ,నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

నంద్యాల అర్బన్ : జగనన్న క్రీడా సంబరాలు ఆటల పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి శుక్రవారం నంద్యాలలో ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్ పద్మావతి నగర్ క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ జట్టుని ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్రీడల అధికారి ఎం.ఎన్.వి రాజు, నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ పిడి ఏపీ రెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ రమణ రెడ్డి, ఫెన్సింగ్ కోచ్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చామకాల్వలో చిన్నారి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం గోపాల్ నగర్ చామకాల్వలో చిన్నారి మృతదేహం లభ్యమయింది. పసికందును గుర్తుతెలియని వ్యక్తులు చామకాల్వలో పడేశారు. కాల్వలో మతదేహాన్ని గుర్తించి స్దానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మగపిల్లాడి మతదేహంగా పోలీసులు గుర్తించారు. చిన్నారి చేతికి తగిలించిన ఆసుపత్రి ట్యాగ్ ద్వారా తల్లిదండ్రులను గుర్తించే ప్రయత్నం చేస్తూన్నట్లు పోలీసులు తెలిపారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - గోస్పాడు

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగే స్థానిక గ్రంథాలయ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయం అధికారి వజ్రాల భవాని అన్నారు. శుక్రవారం వారు మాట్లాడారు. డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన, తదితర అంశాలపై వార్షికోత్సవ ముగింపు వేడుకలు జరుగుతాయని అన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

అంతర్జాతీయ పోటీలకు ఐడిఎస్ విద్యార్థి

- అభినందించిన కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక ఐడిఎస్ హైస్కూల్ విద్యార్థి నిర్భిత్ సంజీవరెడ్డి అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ క్రీడలకు అర్హత సాధించాడు. జాతీయస్థాయిలో కర్ణాటకలోని హోస్పెట్‌లో జరిగిన జంప్ రోప్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడాకారుడు నిర్భిత్ సంజీవరెడ్డిని స్థానిక పాఠశాలలో జరిగిన అభినందన సభలో కేంద్ర కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్ చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి (వాసు) అభినందించారు. జంప్ రోప్ క్రీడలో థాయిలాండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు ఎంపిక కావడం అభినందనీయమని శ్రీనివాసరెడ్డి అన్నారు. అలాగే ఇదే పాఠశాల నుండి రెండవ స్థానం నందు వచ్చి అంతర్జాతీయ స్థాయి అవకాశం కొద్దిలో కోల్పోయిన లోకేష్‌ను కూడా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సురేంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, జానకి, న్యాయవాది వినోద్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘం డివిజన్ అధ్యక్షులు అమిర్ బాష, పాఠశాల ప్రిన్సిపాల్ లింగారెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను పునః సమీక్షించాలి

- జాతీయ బిసి సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను సుప్రీంకోర్టు పునఃసమీక్ష చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం నంద్యాల జిల్ల అధ్యక్షులు చింతకుంట కురుమూర్తి పేర్కొన్నారు. ఇటీవల ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్‌ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చింతకుంట కురుమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరొకసారి పునఃర్ పరిశీలించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోకారి, సి డి ఆంజనేయులు, పగిడ్యాల మండలం ప్రెసిడెంట్ బలరాముడు, విజయ్, శ్రీనివాసులు, పెద్దయ్య నాయుడు, వెంకటేశ్వర్లు, జనార్ధన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాల కోసమే క్రీడా సంబరాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలను వెలికితీయాలనే లక్ష్యంతో జగనన్న క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో జగనన్న క్రీడా సంబరాల పోస్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ డిసెంబర్ 21వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాలు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాం మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా క్రీడల అధికారి ఎం.ఎన్.వి రాజు, బనగానపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పిడి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శివరామయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఐఎంఏ రాష్ట్రస్థాయి వైద్యుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఏడవ రాష్ట్రస్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సు, ఏడవ రాష్ట్ర మహాసభలు ఈనెల 12, 13వ తేదీలలో నంద్యాలలో నిర్వహిస్తున్న సందర్భంగా వైద్యులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో రామకృష్ణ పీజీ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైద్యుల క్రీడా పోటీలను రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన డాక్టర్ జి రవికృష్ణ మాట్లాడుతూ వృత్తి రీత్యా నిరంతరం ఒత్తిడితో గడిపే వైద్యులకు ఉల్లాసం కలిగించడం కోసం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం శ్రమించే వైద్యులకు క్రీడలు కళలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి క్రీడా పోటీల నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ షటిల్ బ్యాట్మెంటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకి బహుమతులు రాష్ట్ర జాతీయ ఐఎంఏ నాయకుల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. తదుపరి షటిల్ పోటీలను డాక్టర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, పిజి కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి మొదటి మ్యాచ్ ఆడి ప్రారంభించారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, నంద్యాల ఐఎంఎ శాఖ అధ్యక్షులు డాక్టర్ జాఫరుల్లా, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కోశాధికారి డాక్టర్ ఫనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర శాఖ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఎం.ఎస్.శర్మ , రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సేవా కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మూర్తి, డాక్టర్ మురళి, డాక్టర్ పాండురంగారావు ,డాక్టర్ శరత్, డాక్టర్ వినోద్, డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మదా,డాక్టర్ వసుధ, డాక్టర్ శైలజ, డాక్టర్ లలిత, డాక్టర్ సింధు అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

రెండు రోజుల వైద్య వైజ్ఞానిక సదస్సు

రాష్ట్ర వర్కింగ్ కమిటీ, రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు

భారతీయ వైద్య సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఏడవ రాష్ట్రస్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సు, ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశాలు, రాష్ట్ర ఐఎంఏ కౌన్సిల్ మహాసభలు శనివారం నుండి నంద్యాలలో రెండు రోజులపాటు జరగనున్నాయి. 25 జిల్లాల నుండి 100 ఐఎంఏ శాఖల తరపున 1200 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులపాటు జరిగే వైద్య వైజ్ఞానిక సదస్సులో 27 మంది వివిధ శాఖల వైద్య నిపుణులు 27 అంశాలపై వైద్యులకు నిరంతర వైద్య విధానంలో భాగంగా అవగాహన కల్పించనున్నారు. ఈ వైద్య వైజ్ఞానిక సదస్సు ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తున్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవం, ఐఎంఏ రాష్ట్ర శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజ ఆనందప్రసాద్ సింగ్ జాతీయ నాయకులు డాక్టర్ అప్పారావు, శరదగర్వాల్ ,డాక్టర్ రవి వాన్ ఖేడ్ కర్, డాక్టర్ జయలాల్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాలకు చెందిన డాక్టర్ జి.రవికృష్ణ ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, వైజ్ఞానిక సదస్సు చైర్మన్ డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ కోశాధికారి డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ జఫ్రుళ్ళ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

గణ మద్దిలేటి యాదవ్ మృతి సంఘానికి తీరని లోటు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామానికి చెందిన యాదవ అన్న సత్రం అధ్యక్షులు, యాదవ సంఘం నాయకులు పిబి గణ మద్దిలేటి యాదవ్ మృతి యాదవ సంఘానికి తీరని లోటు అని యాదవ సంఘం జిల్లా నాయకులు సిద్ధపు పాండురంగ యాదవ్, జి. మద్దయ్య యాదవ్‌లు అన్నారు. శుక్రవారం గణ మద్దిలేటి యాదవ్ మృతి విషయం తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు పాండురంగ యాదవ్ ,మద్దయ్య యాదవ్, పవన్ కుమార్ యాదవ్, పలుకురు రాం పుల్లయ్య యాదవ్, క్రిష్ణగిరి రంగస్వామి యాదవ్, మధు యాదవ్, మంగంపేట రమణ యాదవ్ ,మనోహర్ యాదవ్, కోడి రమణ యాదవ్, కుమార్ యాదవ్ బాల వెంకటేశ్వర్లు యాదవ్ తదితర యాదవ సంఘం నాయకులు గణ మద్దిలేటి యాదవ్ మృతదేహానికి


గణ మద్దిలేటి యాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణ మద్దిలేటి యాదవ్ యాదవ సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. గణ మద్దిలేటి యాదవ్ మృతి యాదవ సంఘానికి తీరని లోటు అన్నారు. **బీసీ ఇందిరా సంతాపం :** మండలంలోని నందవరం గ్రామంలో యాదవ అన్న సత్రం అధ్యక్షులు టిడిపి నాయకులు పిబి గణ మద్దిలేటి యాదవ్ మృతికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా సంతాపం తెలిపారు. గణ మద్దిలేటి యాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి బీసీ ఇందిరానివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సెపక్ తక్రా జట్టుకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నంద్యాల జిల్లా జూనియర్ సెపక్ తక్రా బాల, బాలికల జట్టు కు వారం రోజుల నుండి పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కోచింగ్ క్యాంపునిర్వహించడం జరిగింది .ఈ క్యాంప్ ముగింపు కార్యక్రమం లో 20 మంది క్రీడాకారులకు స్థానిక శ్రీనివాస మెటల్ స్టోర్ యజమాని అయ్యపు శ్రీనివాసులు క్రీడా దుస్తులు వితరణ చేసారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మమ్మ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో బాగ ఆడి మంచి పేరు తీసుకొస్తారని , క్రీడల వలన మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పోటీలలో విజయం సాధించి ఆ సర్టిఫికెట్ తో క్రీడాకోటలో ఉ ద్యోగం సంపాదించి మీ కలలు నెరవేర్చుకోగ లరు అని తెలియజేశారు. హాస్టల్ వార్డెన్ ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ క్రీడల వలన చెడు అలవాట్లకు లోను కాకుండా మంచి క్రమశిక్షణ అలవడుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు నరసింహ, నాగేంద్ర, దేవేంద్ర, శ్రీనివాసరెడ్డి, బాబు, ప్రతాప్,సుబ్బయ్య పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. శుక్రవారం ఎంపీడీవో అమానుల్లా ఆధ్వర్యంలో ఎంపిపి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. వెలుగోడు, అలగనూరు మిడుతూరు, గార్గేయపురం మీదుగా కర్నూలుకు బస్సు నడపాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులను ప్రజలు కోరుతున్నారని ఎంపిపి తెలిపారు. మోత్కూరు పశు వైద్యాధికారి సుధాకర్ రెడ్డి పశువులకు సోకే లంపి వైరస్ పై వివరణ ఇచ్చారు. అదేవిధంగా మేజర్ గ్రామపంచాయతీ పంచాయతీ సెక్రెటరీ హరి లీలా కు కుక్కల బెడదా ఎక్కువ ఉందని ఎంపిపి తన దృష్టికి వచ్చిందని వీటిపై వివరణ కోరారు. ఆమె మాట్లాడుతూ మూగజీవాలపై తమకు ఎటువంటి పద్ధతులలో గాని ఎవరు కూడా తమ సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - అవుకు: ఈనెల 16వ తేదీన అవుకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి అజామ్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండల అధ్యక్షుడు చల్ల రాజశేఖర్ రెడ్డి హాజరవుతున్నారని అన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన మండల అధికారులు తమ శాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేయబోవు అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని అన్నారు. సమావేశానికి అందరూ ఎంపిటీసీలు, అన్ని గ్రామాల సర్పంచులు హాజరు కావాలని అన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు : వైసిపి

శ్రీశైలం ప్రాజెక్టు : ప్రజల కొరకు పని చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సుండి పెంట వైసిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకులు గుండయ్య యాదవ్, వట్టి వెంకటరెడ్డి,మహిళా కార్యకర్త ప్రభావతి, ప్రవీణ్ తేజలు మాట్లాడారు. శ్రీశైలం మండలంలోని లింగాల గట్టు, శ్రీశైలం, సుండిపెంట లో ని సమస్యలను ఎమ్మెల్యే శిల్పా పరిష్కరిస్తూ ముందుకు పోతున్నారని అన్నారు. లింగాల గట్టులో ఇళ్ల కూల్చివేతకు శిల్పాకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. 2009లో లింగాల గట్టు వరద నీటితో మునిగిపోయినప్పుడు సున్నిపెంటలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగాలు గట్టు మత్స్యకారులు చెల్లూరి మల్లికార్జున, కొండబాబు,సోమేశు స్థానికుల స్థానిక వైసిపి నాయకులు దానియేలు, ఏసు, బద్రి నాయక్ పాల్గొన్నారు.

పార్క్ పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వెంకటేశ్వరపురం ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సి రవి చంద్రారెడ్డి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం వెంకటేశ్వరపురం వద్ద ఫ్లైఓవర్ క్రింద నూతనంగా నిర్మిస్తున్న పార్క్ పనులను మునిసిపల్ డిఈ జయభారత్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద జరుగుతున్న పార్కు పనులను ఈ సందర్భంగా వారు పరిశీలించారు. పార్క్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. త్వరలో పార్కును ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. సెలవు దినాల్లో సాయంకాలం పూట పట్టణ ప్రజలు నగర శివారుకు వచ్చి హాల్లాదగ్గరమైన పార్కుల్లో సంతోషంగా తమ కుటుంబ సభ్యులతో గడపవచ్చని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వల్లే విద్యుత్ ప్రమదాలు : ఇఇ

ప్రజాశక్తి - పగిడ్యాల

నిర్లక్షం వల్లే విద్యుత్ షాక్ కొట్టి ప్రమదాలు జరుగుతున్నాయని విద్యుత్ శాఖ ఇఇ శ్రీనివాసబాబు, డిఇ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పగిడ్యాల మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ ప్రమదాల పై ఎంఇఒ సుభాన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాజి జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ఇఇ శ్రీనివాసబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డిగారి రమాదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థు మీ ఇంటికెల్లి తమ తల్లిదండ్రులకు పూర్తి వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. ఎఇ క్రాంతికుమార్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుజన, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల కేంద్రమైన కొలిమిగుండ్ల అయ్యప్ప గ్రామోత్సవం ఘనంగా శుక్రవారం నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించిన అయ్యప్ప భక్తుల, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, పేరం సూర్యనారాయణరెడ్డి, పేరం నందకిషోర్ రెడ్డి, గొర్రెల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్ బి జయరాముడు యాదవ్, ఆంజనేయులు, గురుస్వామి జడలమ్మ గారి నాగరాజు, అయ్యప్ప మాల ధరించిన గురుస్వాములు పాల్గొన్నారు. శ్రీ లలిత సుందరేశ్వర స్వామి దేవస్థానం నుండి గ్రామంలోని గ్రామంలోని పూరి వీధుల గుండా వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ డిఎస్పిగా సుధాకర్ రెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా ఇడమకంటి సుధాకర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ డివిజన్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కు పాదం మోపుతామన్నారు. తాను సీఐగా, ఎస్ఐగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్లోనే పనిచేయడం జరిగిందని, తనకు ఈ ప్రాంతం సుపరిచయమన్నారు. నల్లమల అడవి ప్రాంతంలో ఉన్న ఎర్రచందనాన్ని నరికే వారిపై గట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు పోలీసుల సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయన్నారు. అంతకుముందు డిఎస్పి సుధాకర్ రెడ్డి ఎగువ, దిగువ అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు : పిడి

- ఉపాధి పనులపై బహిరంగ సభ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న ఉపాధి అధికారులు ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని పిడి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏపీ డి ఏసుదాసు ఆధ్వర్యంలో ఉపాధి పనులపై బహిరంగ సభ నిర్వహించారు.

కొత్తపల్లి మండలంలో ఉన్న పలు గ్రామాల్లో 2020 ఏప్రిల్ 1 నుండి 2021 మార్చి 31 వరకు జరిగిన పనులపై బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. గత వారం రోజుల నుంచి సామాజిక తనిఖీ వారు ప్రతి గ్రామంలో తిరిగి ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. పిడి మాట్లాడుతూ రికవరీ 66,399 పెనాల్టీ 6000 మొత్తం రికవరీ 72,399 వేలు రికవరీ తనిఖీల్లో బయటపడిందన్నారు. ఈ సామాజిక బహిరంగ సమావేశంలో అడిషనల్ పీడీ సలీం బాష, జిల్లా విజిలెన్స్ అధికారి డ్వామా సిద్ధ లింగమూర్తి, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఎస్ఆర్పి నాగార్జున, ఏవివో శివరాణి, ఏపీవో శ్రీనివాసులు, పాములపాడు ఏపీవో విమలమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు, డిఆర్పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయాలను ఐటీడీఏ పిడి తనిఖీ

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని ఎర్ర గూడూరు, పాములపాడు, రుద్రవరం సచివాలయాలను శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సరిగా లేనందున అసంతృప్తి వ్యక్తపరిచారు. అటెండెన్స్ రిజిస్టర్‌లలో సంతకాలు లేకపోవడం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తపరిచారు. సచివాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహించరా దన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. . ఈ కార్యక్రమంలో ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ ఆత్మకూరు కేజీ నాయక్, సీమన్ పాల్గొన్నారు .


తనిఖీ చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రారెడ్డి

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

గురురాజాలో .. స్వతంత్ర్య భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి చేతుల మీదుగా రచయిత కొప్పుల ప్రసాద్ రచించిన 'పసి నవ్వుల అలలు' కవితా సంకలనం ఆవిష్కరించారు. రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడారు. **శిరివెళ్ల :** మండల కేంద్రంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్ నివాళ్లు అర్పించారు. **రుద్రవరంలో..** స్థానిక మోడల్ పాఠశాలలో **చాగలమర్రి :** మండలంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్


గురురాజాలో పుస్తకావిష్కరణ

ఆధ్వర్యంలో ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **డోన్ :** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట డోన్ నందు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ అధ్యక్షతన జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ముస్లిం మైనారిటీ నాయకులు అబూబక్కర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, పి.కిషోర్


రుద్రవరంలో

అబుల్ కలాంకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, అబూబక్కర్, ఆర్.టి.సి బాబు, జలాల్ మోలిసా, మైనారిటీ నాయకులు సలామ్, కౌన్సిలర్ లు అబ్దుల్ రవూఫ్, సప్లయర్ సత్యనారాయణ, ఉస్మాన్ బేగ్, జబ్బర్, శ్రీకాంత్ గౌడ్, సి.పి.యం నాయకులు నాగేశ్వరరావు, పి.రమేష్, అవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్లా, వెంకటేశ్వర్లు తేదీతరులు పాల్గొన్నారు.

ప్యాపిలిలో.. వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు మత్తు బాబాసాహెబ్, సామ్ సన్, పార్థసారథి, తిరుపాల్ జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. **నంద్యాల పట్టణంలో** పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ డేను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్ర నాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడారు. **బనగానపల్లె :** పట్టణంలోని కస్బా పాఠశాల లోఎంఈఓ పి స్వరూప మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. **ఆత్మకూర్ :** మండలంలోని అని పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవంను నిర్వహించారు. కురుకుంద గ్రామంలోని ఎంపిపి ఎస్ మెయిన్ స్కూల్‌లో హెచ్ఎం రషీద్ ఆధ్వర్యంలో మౌలనా చిత్రపట్టానికి నివాళ్లు అర్పించారు. **పగిడ్యాల :** మండలంలోని పాలమర్రి గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో మౌలనా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు.


బహుమతి అందుకుంటున్న సునీనా తబుసూమ్

లిటిల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వెలుగోడు

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా లిటిల్ ఏంజెల్ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పదవ తరగతి విద్యార్థిని సునీనా తబుసూమ్ మొదటి బహుమతి సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానియేల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల 6 నుండి 10 వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారని అన్నారు. అందులో 6, 7, 8 వ తరగతి విద్యార్థులకు జూనియర్ విభాగంలో మొదటి బహుమతి లిటిల్ విద్యార్థిని మధు నయన శ్రీ, జిబిఎం విద్యార్థులు లావణ్య, సుజాత 9,10 సీనియర్ విభాగంలో లిటిల్ విద్యార్థులు మొదటి రెండవ బహుమతులు సునినా, అంజలి, మూడో బహుమతి జీపీఎం పాఠశాల విద్యార్థిని బ్రహ్మాణి గెలుపొందారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బృందావనం,జిబిఎం పాఠశాల కరస్పాండెంట్ ఫయాజ్ అలి ఖాన్, చంద్రశేఖర్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్, అపియ ప్రశాంత పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

యూనియన్ బ్యాంక్ 104వ వార్షికోత్సవ వేడుకలను బనగానపల్లె బ్రాంచ్‌లో మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకులో మేనేజర్ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలను అందించడంలో యూనియన్ బ్యాంకు 104 సంవత్సరాలుగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకంతో దేశంలోనే అతిపెద్ద రెండవ బ్యాంకుగా వెలసిందని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల సేవలను యూనియన్ బ్యాంకు అందిస్తుందని, ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శివచందన్, హరి, జాఫర్ హుస్సేన్, అబ్దుల్, ప్రవీణ్,నాగార్జున, దస్తగిరి, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

మహానంది : 104వ అవతరణ దినోత్సవంను మహానందిలో ఆంధ్ర బ్యాంక్ (యూనియన్) బ్యాంక్ శాఖ మేనేజర్, సిబ్బంది జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ మధు పాల్గొన్నారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని మేనేజర్ రామకృష్ణారెడ్డి ఈవోను కోరారు. డిపాజిట్లు తమ బ్యాంకు ఖాతాకు అధికం చేయాలని సూచించారు. ఆలయ ఉద్యోగులకు కూడా పర్సనల్ రుణాలు మంజూరు చేస్తానని ఇప్పటికే కొందరికి చేశానని మేనేజర్ ఈవోకి తెలిపారు. అనంతరం ఈవో మాట్లాడుతూ వడ్డీ రేట్లు తగ్గించడంతోపాటు డిపాజిట్ల కొరకు విధించిన పరిమితి పెంచిన కాలాన్ని కూడా తగ్గించాలని మేనేజర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ ఆచారి, సిబ్బంది ఓబులేసు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలుకురు మూడవ సచివాలయం పరిధిలోని గొవిందిన్నె, దేవనగర్ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వైసిపి మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి,జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాం మోహన్ రెడ్డి,సర్పంచ్ కోనేటి సుమలత,ఉప సర్పంచ్ శివ క్రిష్ణ,ఎంపిటీసీ వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ లువెంకట రమణ, ప్రసాద్, గోవిందీన్నె గ్రామ వైసిపి నాయకులు వెంకటయ్య,మధు,శంకర్ రెడ్డి,ప్రసాద్, బద్రి,బోయ బాల మద్ది,శ్రీను, నారాయణ, బసవయ్య, సాయిబాబా, దేవ నగర్ గ్రామ నాయకులు బాలు,సుధాకర్,మద్దిలేటి, రాము ,అనిల్, మండల అభివద్ధి అధికారి శివ రామయ్య, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని స్వరాజ్ నగర్ ఇందిరానగర్ సాయిబాబా నగర్ గరీబ్ నగర్ కాలనీలలో మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా .వైస్ చైర్మన్ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో శ్రీశైల శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిలర్ విజయ్ చౌదరి, కో ఆప్షన్ సభ్యుడు ఎం ఏ రషీద్, ప్రకాష్ రావు, రంగస్వామి, ఖైరున్ బీ, పాణ్యం పార్వతి, వైసీపీ నాయకులు పువ్వాడి భాస్కర్, అంజాద్ అలీ, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని నందికొట్కూర్ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ తెలిపారు. మండలంలోని బావాపురం నందికుంట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పథకాలు మంజూరు చేయడం విషయంలో అధికారులు లంచాలు అడిగితే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, విజయ్ కుమార్, మారెన్న, మండల వైఎస్ఆర్సిపి నాయకులు రఫీ, శ్రీనాథ్ రెడ్డి, జకరయ్య శివారెడ్డి, సాయిరాం రాము, సుబ్బన్న, పరుశురాముడు, ఓబులేష్, ప్రసాద్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి, నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్మోహన్ రెడ్డిలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వము ద్వారా ఆ కుటుంబానికి అందిన సంక్షేమం, అభివద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, అజాద్, కౌన్సిలర్లు స్వరూప, బాలబ్బీ, వరాలమ్మ పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నవరత్నాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు ఫరూక్ నగర్ లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 54వ రోజు జరిగింది. ఎమ్మెల్యే వార్డులో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకొని చిన్న చిన్న సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్ని సా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమతరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావళి, వార్డు వైసిపి నాయకులు రఫీ ,గన్ని కరీం, హుస్సేన్ సా,అబిబుల్లా, ఇమామ్, గన్ని షేక్షావలి, ఇలియాజ్ ,రజాక్ మియా తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం:** మండలంలోని చిత్రేనిపల్లె గ్రామంలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ బాలస్వామి, సహకార సంఘం అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి,వైసిపి నాయకులు చిన్న మాధవ గౌడ్, నరసింహయ్య శెట్టి, గంగిశెట్టి మద్దిలేటి శెట్టి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి, ఆర్థర్, ఎమ్మెల్సీ